సాక్షి కామారెడ్డి
ఆదివారం। 15। జనవరి। 2023



పిల్లలూ జర పైలం !
సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.
- 8లో ▸



మార్కెట్‌లో సందడి
సంక్రాంతి సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు ఆయా పట్టణాల్లో కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.9 /17.3
చలి గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకోవచ్చు. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'పోచారం' నీటివిడుదల నిలిపివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నుంచి నీటివిడుదలను శనివారం నిలిపివేశారు. ఈ నెల 1న నీటివిడుదల చేపట్టిన అధికారులు మొదటి విడతగా 14 రోజుల కొనసాగించారు. ప్రాజెక్టు పరిధిలోని 'ఏ' జోన్ ఆయకట్టు భూముల్లో యాసంగి పంటల సాగు కోసం ప్రతిరోజూ ప్రాజెక్టు నుంచి సుమారు 200 క్యూసెక్కుల చొప్పున ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేశారు. 10 రోజుల తర్వాత ప్రాజెక్టు నుంచి రెండో విడతగా నీటివిడుదల చేపట్టనున్నారు.

రెండో దఫా 'సాగర్' నీటి విడుదల



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న పంటలకు రెండో దఫా నీటిని విడుదల చేస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు పంటలు సాగు చేయడంతో ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 1500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు డిప్యూటీ ఈఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడుదల చేస్తున్న నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా పంట కాలువకు విడుదలవుతున్న నీటిని వృథా చేయవద్దని కోరారు.

ఆపదలో ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్



బాన్సువాడ రూరల్: బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రాహింపేట్, బోర్లం, తాడ్కోల్, రాంపూర్ తదితర గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలకు శనివారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవతో నిరుపేదలకు పథకాల ద్వారా నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు. నాయకులు జంగం గంగాధర్, నర్సింలు, అంజిరెడ్డి, మహ్మద్ ఎజాస్, మోహన్‌నాయక్, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోన్ల మార్పుపైనే అత్యధికంగా అభ్యంతరాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై భారీగా అభ్యంతరాలు వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 2,396 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని మున్సిపల్ అధికారులు పరిశీలించి జోన్‌లు, ఇండస్ట్రియల్, రోడ్లు ఇతర అంశాల వారీగా విభజించారు. ఇందులో ఎక్కువగా జోన్ల మార్పుపైనే అభ్యంతరాలు వచ్చాయి. ఇండస్ట్రియల్ జోన్‌లు ఎత్తివేయాలని 699, ప్రతిపాదిత రోడ్లకు 300, గ్రీన్ జోన్‌కు 222, రిక్రియేషన్ 212 అభ్యంతరాలు వచ్చాయి. అలాగే అడ్వకేట్ ద్వారా నోటీసులు 250 కాగా, ఇతర వాటికి వచ్చిన అభ్యంతరాలు 155 ఉన్నాయి. ప్రధానంగా ఇండస్ట్రియల్ జోన్‌లు, ప్రతిపాదిత రోడ్లపైనే రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. కోట్ల విలువ చేసే భూములను ఇండస్ట్రియల్ జోన్లకు మార్చితే విలువ పడిపోతుందని రైతులు వాపోతున్నారు. 100 ఫీట్ల రోడ్లలో పూర్తిగా భూములు కోల్పోతున్నామని పేద రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు.

నేడు జిల్లా కేంద్రంలో రోడ్లపై ముగ్గులతో నిరసన

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని, కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ సంక్రాంతి రోజు ఆదివారం జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన కూడళ్ల, రోడ్లపై ముగ్గులతో నింపి నిరసన చేపడుతున్నట్లు రైతు జేఏసీ ప్రతినిధులు శనివారం తెలిపారు. అన్ని విలీన గ్రామాలు, పట్టణ రైతులు తమ భార్య బిడ్డలు, తల్లి, సోదరిమణులతో వచ్చి నిరసనలో పాల్గొనాలని కోరారు. జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం గంజ్‌రోడ్డు దగ్గరకు రైతులు రావాలని, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిరసనలో పాల్గొనాలని కోరారు.



రైతునగర్‌లో భోగి మంటలు వేసుకుంటున్న గ్రామస్తులు



చిన్నారిపై భోగిపండ్లు పోస్తూ..

ఊరుమ్మడి పండుగ!

- రైతునగర్‌లో ఘనంగా సంబరాలు
- 'భోగి'తో మొదలైన వేడుకలు
- గ్రామస్తులంతా కలిసి జరుపుకునే పండుగ
- సొంతూరికి తరలివచ్చిన ప్రజలు

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ: ఎక్కడా లేని విధంగా ఆ ఊళ్లో అందరూ కలిసి సంక్రాంతి వేడుకలను ఉమ్మడి చేసుకునే సంప్రదాయం కొనసాగుతోంది. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన ఆ గ్రామస్తులంతా పండుగకు తప్పకుండా సొంతూరికి చేరుకుంటారు. దీంతో ఊరంతా కళకళలాడుతూ కనిపిస్తుంది. మూడు రోజుల పాటు ఊరంతా పండుగ అన్నట్లుగా ఉంటుంది. బీర్కూర్ మండలంలోని రైతునగర్‌లో గత పదేళ్లుగా జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. కరోనా మూలంగా రెండేళ్ల పాటు వేడుకలు సాదాసీదాగా జరిగాయి. ఈ సారి అందరూ చేరుకుని ఆనందంగా పండుగను జరుపుకుంటున్నారు. శనివారం భోగిని ఆనందంగా జరుపుకున్నారు. ఉదయమే అందరూ ఒకచోట చేరి భోగిమంటలు వేసుకున్నారు. తర్వాత పిల్లలకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాత్రి అందరూ కలిసి భోజనం చేస్తారు. సంక్రాంతి వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

ఉన్నత చదువులతో ఉన్నతోద్యోగాలు..

రైతునగర్‌లో 250 కుటుంబాలున్నాయి. అందరూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తారు. వారి పిల్లలు చాలా మంది ఉన్నత చదువులు చదివి దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో 120 మంది వరకు స్థిరపడ్డారు. పండుగకు మాత్రం అందరూ సొంతూరికి వస్తారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ పోలీసు శాఖలో డీఎస్పీగా పనిచేస్తుండగా, మరొకరు సీఐగా, ఇద్దరు ఎస్సైలుగా, ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులుగా ఇరవై మంది పనిచేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాతో పాటు వివిధ దేశాల్లో యాభై మందికి పైగా ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, పూణె తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా 60 మంది ఉద్యోగాలు చేస్తున్నారు.

జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న రైతునగర్ గ్రామానికి చెందిన వారంతా 2013లో సంక్రాంతి పండుగకు వచ్చిన సందర్భంగా జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాల గురించిన అవగాహన, పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం, కోచింగులు ఇవ్వడం, స్టడీ మెటీరియల్ సమకూర్చడం వంటి పనులు చేపట్టారు. 2014లో సంక్రాంతి ఉత్సవాలను ఉమ్మడిగా మొదలుపెట్టారు. ఏడేళ్లపాటు ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా కన్న ఊరికి రావడం, అందరూ కలిసి ఆనందంగా మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు జరుపుకునేవారు. రంగవల్లుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, కుస్తీ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జోరుగా నిర్వహించేవారు. భోజనాలు ఏర్పాటు చేసి అందరూ కలిసి భోజనాలు చేస్తారు.

ఎక్కడ ఉన్నా సంక్రాంతికి ఇక్కడికే..



ఉద్యోగరీత్యా ఎక్కడ ఉన్నా సరే సంక్రాంతికి తప్పనిసరిగా వచ్చేస్తాను. కరోనా మూలంగా రెండేళ్ల ఇబ్బందులు పడ్డాం. ఈ సారి ముందుగానే నిర్ణయించుకున్న ప్రకారం సెలవులు పెట్టుకుని నా సతీమణి ఇందు, పాపతో కలిసి వచ్చాం. మూడు రోజుల పాటు అందరూ కలిసి ఎంజాయ్ చేస్తాం. అందరూ తప్పనిసరిగా పండుగకు రావడం వల్ల అనుబంధాలు కొనసాగుతాయి. ఎంతో ఆనందంగా పండుగను జరుపుకుంటాం. –మహేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్, గండిపేట

సొంతూరిని మరువం..



మా ఊళ్లో ప్రతి ఇంట్లో చదువుకున్నవాళ్లున్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగాలుచేస్తున్నారు. అలాగే వ్యాపారాల్లోనూ అగ్రభాగాన ఉన్నారు. ఎంత ఎదిగినా పండుగ సమయంలో అందరూ సొంతూరికి వస్తారు. అందరం కలిసి పండుగను జరుపుకుంటాం. జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ఏడాదంతా గుర్తుండిపోతాయి. –చైతన్యకృష్ణ, విండో వైస్ చైర్మన్

పండుగకు తప్పకుండా వస్తాం



మా పిల్లలు అమెరికాలో ఉన్నారు. వాళ్లకు వీలు కాకపోవడంతో ఈ సారి రాలేదు. వచ్చే ఏడాది తప్పకుండా వస్తారు. మేము హైదరాబాద్‌లో ఉన్నా సంక్రాంతికి తప్పకుండా వచ్చి అందరితో కలిసి ఎంజాయ్ చేస్తాం. ఎన్ని పనులున్నా పండుగకు రావాల్సిందే. నేను, మా ఆవిడ రత్నకుమారి మొన్ననే వచ్చినం. నాలుగు రోజులు ఉండి వెళతాం. – కొమ్మినేని భాస్కర్‌రావ్, వ్యాపారవేత్త



ఆటల పోటీల్లో పాల్గొన్న పిల్లలు



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నాగేశ్వర్‌రావు

మరిన్ని అభిప్రాయాలు -8లో..

ఆగని రైతుల నిలదీతలు

- విలీన గ్రామాల కౌన్సిలర్లకు రాజీనామాల సెగ
- హడావుడిగా రైతుల వద్దకు అధికారపార్టీ కౌన్సిలర్లు
- మాస్టర్‌ప్లాన్ రద్దు ఉద్యమానికి మద్దతుగా ఉంటామని హామీ
- కౌన్సిల్‌లోనే రద్దు తీర్మానం చేయాలని రైతుల డిమాండ్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ఉద్యమంలో భాగంగా రైతుల నిరసనలు, నిలదీతలు ఆగడం లేదు. 40 రోజులుగా రైతులు మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 20న విలీన గ్రామాల కౌన్సిలర్లు రాజీనామా చేయాలని డెడ్‌లైన్ పెట్టారు. ఈ విషయంపై శుక్రవారం రాత్రి అధికార పార్టీ, విలీన గ్రామాల కౌన్సిలర్‌లతో పొందుర్తి సమీపంలో ఫామ్‌హౌజ్‌లో ప్రభుత్వ విప్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు నచ్చజెప్పాలని సూచించినట్లు తెలిసింది. దీంతో శనివారం ఉదయం కొందరు కౌన్సిలర్లు రైతుల వద్దకు వెళ్లి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే ఒక్కో గ్రామంలో ఒక్కోరకంగా కౌన్సిలర్లు హామీ ఇవ్వడంతో రైతులు వ్యతిరేకిస్తున్నారు. కౌన్సిల్‌లో చర్చించి మాస్టర్‌ప్లాన్‌పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్ చేశారు.

లింగాపూర్‌లో వైస్ చైర్‌పర్సన్

లింగాపూర్‌లో శనివారం ఉదయం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, 35 వార్డు కౌన్సిలర్ కృష్ణాజీరావు, 9వ వార్డు కౌన్సిలర్ పడిగె సుగుణ, 10వ వార్డు కౌన్సిలర్ భర్త స్వామిలు లింగాపూర్ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొదట రైతులు కౌన్సిలర్లను నిలదీశారు. ఇన్ని రోజులు ఉద్యమం చేస్తుంటే ఇప్పుడు గుర్తుకొచ్చామా అని ప్రశ్నించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ రైతులకు లేఖను రాసిచ్చారు. దేవునిపల్లి, లింగాపూర్‌లో 80 ఫీట్ల, 100 ఫీట్ల రోడ్డు, గ్రీన్ జోన్ రద్దు కాకుంటే రైతుల ఉద్యమానికి మద్దతుగా ఉంటామని లేఖలో రాశారు.



లింగాపూర్‌లో రైతుల ఉద్యమానికి మద్దతు తెలుపుతూ లేఖను అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్

మిగతా ప్రాంత బాధితుల రైతుల గురించి పలువురు ప్రశ్నించగా అక్కడ కూడా మిగతా కౌన్సిలర్లు సమాధానం ఇస్తారని చెప్పారు. అసలు మాస్టర్ ప్లాన్ బాధిత విలీన గ్రామాలకు సంబంధం లేని వైస్ చైర్‌పర్సన్ వచ్చి లేఖ ఇవ్వడం ఏమిటని రైతులు వాపోయారు. వచ్చిన మిగతా కౌన్సిలర్లు హామీ ఇవ్వకపోవడం, లేఖలో సంతకాలు చేయకపోవడంపై రైతులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయమై అక్కడికి వచ్చిన ఇద్దరు కౌన్సిలర్లను 'సాక్షి' సంప్రదించగా తమ వద్దకు బాధిత రైతులు రాలేదని.. వస్తే వారికి సమాధానం ఇస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పాత రాజంపేట్‌లో..

పాత రాజంపేటలో రైతులతో మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి తండ్రి నిట్టు వేణుగోపాల్‌రావు పలువురు కౌన్సిలర్లు వెళ్లి అక్కడి రైతులతో సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్‌లో రైతులకు అన్యాయం జరగకుండా చేస్తామని పాత రాజంపేట రైతులకు హామీ ఇచ్చారు.

విలీన గ్రామాల కౌన్సిలర్ల మౌనం

విలీన గ్రామాల బీజేపీ కౌన్సిలర్లు శ్రీనివాస్, రవిలు ఇది వరకే తాము రాజీనామా చేస్తామని ప్రకటించారు. శనివారం పాతరాజంపేట, లింగాపూర్‌కు వచ్చిన విలీన గ్రామాల అధికార పార్టీల కౌన్సిలర్లు మాత్రం రైతులకు తమ రాజీనామాలపై స్పష్టత ఇవ్వలేదు. రైతులకు ఇచ్చిన లేఖలో కూడా సంతకాలు చేయలేదు. 1, 6, 9, 10, 12. 13, 35వ వార్డుకు చెందిన అధికార కౌన్సిలర్లు ఇప్పటికి స్పష్టంగా రైతులకు హామీ ఇవ్వకపోవడంతో రైతులు వారిపై గుర్రుగా ఉన్నారు. 20వ తేది తర్వాత వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఒక్కో దగ్గర ఒక్కో హామీ

అధికార పార్టీ కౌన్సిలర్లతో ఓ ఫామ్‌హౌజ్‌లో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ సమావేశం నిర్వహించిన మరుసటి రోజు కొందరు కౌన్సిలర్లు రైతులతో సమావేశం నిర్వహించడంపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దుచేసి రైతులకు న్యాయం చేయాలని ఉద్యమం చేస్తుంటే ఇలా రైతులను విభజించి ఉద్యమం నీరుగార్చడానికి వస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. అంతటా ఒకే హామీ ఇవ్వకుండా ఒక్కో చోట ఒక్కో రకంగా హామీలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

రూ. 40 కోట్లతో అభివృద్ధి

- 30 జీపీల నూతన భవనాలకు రూ. 6కోట్లు
- రోడ్లకు రూ. 34.71 కోట్లు
- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజవర్గంలో రూ. 40.71 కోట్లతో అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ తెలిపారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలోని 30 గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 20 లక్షల చొప్పున రూ. 6 కోట్లు మంజూరయ్యాయని, అలాగే నియోజకవర్గంలోని 12 బీటీ రోడ్ల పునః నిర్మాణానికి రూ. 34.71 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇంకా ఆరు జీపీల నూతన భవనాలు మంజూరు కావాల్సి ఉందని, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

12 బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి..

నియోజకవర్గంలోని 12 బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి రూ. 34.71 కోట్లు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్ నుంచి పోసానిపేట వయా అడ్లూర్, రంగంపేట మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ. 2.11 కోట్లు, భిక్కనూరు రాజంపేట వరకు రూ. 4.21కోట్లు, గర్గుల్, రెడ్డిపేట రూ. 2.81 కోట్లు, భవానిపేట కేకేవై, ఇసాయిపేట, ఎల్లంపేట, సోమార్‌పేట, రత్నగిరిపల్లి, గజసింగవరం స్టేజీ వరకు రూ. 5.81 కోట్లు, రెడ్డిపేట నుంచి సింగరాయిపల్లి, ఆరేపల్లి స్టేజీ వరకు రూ. 3.7 కోట్లు, పాత రాజంపేట నుంచి క్యాసంపల్లి, ముత్యంపేట, దోమకొండ వరకు రూ. 3.94 కోట్లు, పాల్వంచ మర్రి నుంచి భిక్కనూరు వరకు రూ. 2.60 కోట్లు, దోమకొండ నుంచి బీబీపేట వయా అంబారిపేట, కొనాపూర్, యాడవరం మీదుగా రూ. 2.83 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే బీబీపేట నుంచి కోనాపూర్ రూ. 2.55కోట్లు, దోమకొండ నుంచి చుక్కాపూర్ వరకు రూ. 1.17కోట్లు, ఎల్లంపేట నుంచి మైసమ్మ చెరువు, రాజ్‌ఖాన్ పేట నుంచి మాచారెడ్డి కేకేవై రోడ్డు వరకు రూ. 2.55కోట్లు మొత్తం 12 రోడ్లకు రూ. 34.71కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు మామిండ్ల అంజయ్య, జూకంటి ప్రభాకర్, బల్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం



బాల్కొండ : బాల్కొండలో వీపీఆర్ కప్ క్రికెట్ టోర్నీని శనివారం ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు ప్రారంభించా రు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ లావణ్య, సర్పంచ్ సునీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ఉప సర్పంచ్ వాహబ్, నిర్వాహకులు అన్వర్, షాహిద్ పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో..



రుద్రూర్: రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని సర్పంచ్ పుష్ప లత రమేశ్ శనివారం గ్రామ యువతకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. హోరాహోరీగా సాగిన పోటీలో సునీల్ జట్టు విన్నర్‌గా నిలిచింది. అనంతరం విజేతకు షీల్డ్, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్, దువ్వ రవి, కారోబారీ అశోక్, భీమయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్ వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ తండా శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. దాడిలో ఏడుగురిని పట్టుకున్నామని, వారి నుంచి రూ.20,250 నగదును స్వాధీనం చేసుకున్నమని పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు కోసం వేధిస్తున్నారు



నిజామాబాద్ సిటీ: ట్రేడ్ లైసెన్స్ విషయంలో హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ మున్సిపల్ కింది స్థాయి అధికారులు వ్యాపారుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ ఫీజు కట్టాలని వేధిస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నల్ల దినేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చిత్రమిశ్రాను కలిసి ఫిర్యాదు చేశారు. శనివారం చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఆమెను కలిశారు. దీనిపై స్పందించిన చిత్ర మిశ్రా హైకోర్టు స్టే ఉన్న మాట వాస్తవమేనని అయినప్పటికీ సిబ్బంది ఎవరైనా వేధిస్తే ఆ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలో ఎటువంటి ట్రేడ్ లైసెన్స్ రుసుము విధించడానికి వీలు లేదన్నారు. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారి ద్వారా కింది స్థాయి ఉద్యోగులకి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దినేశ్‌రెడ్డి ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలోని వ్యాపారస్తులు అందరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సేవలు ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు.

రైతు వేదికలకు రక్షణ కరువు

- తరుచూ దొంగతనాలు
- మందుబాబులకు అడ్డాలుగా మారిన వైనం



పగిలిపోయిన కిటికీ అద్దాలు



కోటగిరి మండలం పోతంగల్ రైతు వేదిక

ఇందూరు: జిల్లాలోని రైతు వేదికలకు రక్షణ కరువైంది. రాత్రుల్లో మందుబాబులకు అడ్డాలుగా మారడంతో పాటు తరుచుగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఆకతాయిల చేష్టలకు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతుండగా, వస్తువులు అపహరణకు గురవుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో పలు సంఘటనలు వెలుచూసినా వీటిని నియంత్రించడానికి జిల్లా యంత్రాంగం పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. ఇటు స్థానిక వ్యవసాయాధికారులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం తప్పా ఏమీ చేయలేకపోతున్నారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలకు భద్రత లేకుండాపోయింది.

రైతులతో సమావేశాలు, సదస్సులు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 106 రైతు వేదికలను నిర్మించింది. ఒక్కో రైతు వేదికకు రూ.20లక్షల వరకు ఖర్చు చేసింది. ప్రస్తుతం వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కూడా ఇందులోనే అందుబాటులో ఉంటున్నారు. కంప్యూటర్లతో పాటు మైక్ సెట్టు, ఫ్యాన్లు, ఇతర అన్ని సౌకర్యాలను సమకూర్చింది ప్రభుత్వం. అయితే గ్రామాలు, మండల కేంద్రాల నడిబొడ్డున నిర్మించాల్సిన రైతు వేదికలను ఊరి చివర నిర్మానుష్య ప్రాంతాల్లో నిర్మించారు. కానీ రక్షణగా ప్రహరీలు, కంచెలు నిర్మించలేదు. దీంతో సిబ్బంది విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రుల్లో మందుబాబులు సిట్టింగ్‌లు వేస్తున్నారు. మరుసటి రోజు చూసే సరికి పరిసర ప్రాంతాల్లో తాగిపడేసిన మద్యం సీసాలు, పగిలిన గాజు పెంకులు దర్శనమిస్తున్నాయి. తాగిన మైకంలో కొందరు రైతువేదికల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. కిటికీలు, తలుపులు పగులగొడుతున్నారు. జన సంచారం లేకపోవడంతో దొంగలు కూడా రెచ్చిపోయి తాళాలు పగులగొట్టి మరీ కంప్యూటర్లు, ఫ్యాన్లు, మైక్ సెట్లు ఎత్తుకెళ్తున్నారు.

సీసీ కెమెరాలు, పెట్రోలింగ్ అవసరం

ఊరి బయట ఉన్న రైతు వేదికలకు భద్రత కల్పించడానికి జిల్లా యంత్రాంగం వీలైనంత త్వరగా స్పందించాల్సిన అవసరం ఉంది. మందుబాబులను, దొంగతనాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు బిగించాల్సిన అవసరం ఉంది. ఇటు రాత్రుల్లో పోలీసులు పెట్రోలింగ్ చేయాలని వ్యవసాయాధికారులు కోరుతున్నా కొన్ని రోజులు మాత్రమే చేస్తున్నారనే విమర్శలున్నాయి. నిరంతరం పెట్రోలింగ్ కొనసాగిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు

- మూడ్రోజుల క్రితం కోటగిరి మండలం పోతంగల్‌లో ఆకతాయిలు రాళ్లు విసిరి రైతు వేదిక కిటికీ అద్దాలను పలుగొట్టారు.
- నెల క్రితం బోధన్ మండలం సిద్ధాపూర్ రైతు వేదిక తాళాన్ని పగులగొట్టిన దొంగలు సీలింగ్ ఫ్యాన్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు.
- బోధన్ మండలంలోని మరో రైతు వేదిక తాళం పగులగొట్టి చొరబడిన దొంగలు మైక్ సెట్టును దొంగలించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

రైతు వేదికల్లో జరుగుతున్న దొంగతనాలు, ఆస్తుల ధ్వంసం అవుతున్నాయనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. వీటిని నియంత్రించడానికి సీసీ కెమెరాల ఏర్పాటు లేదా రాత్రుల్లో పోలీస్ పెట్రోలింగ్ చేయించి రక్షణ కల్పించాలని కోరుతా. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అపహరించే విషయాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని క్షేత్రస్థాయి వ్యవసాయాధికారులకు ఇది వరకే ఆదేశించాం. – ఆర్ తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

బాల్ బ్యాడ్మింటన్ విజేత నిజామాబాద్



పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: ఖమ్మం జిల్లాలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నిజామాబాద్ బాలుర జట్టు గెలుపొందింది. ఫైనల్‌లో రంగారెడ్డి జట్టుపై 35–28, 35–30 తేడాతో జిల్లా జట్టు విజయం సాధించి. జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన బాలుర, బాలికల జట్లను బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్ గౌడ్ అభినందించారు.

ముషీర్‌నగర్‌లో పెంకుటిల్లు దగ్ధం



కాలిపోయిన పెంకుటిల్లు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నూత్‌పల్లి చంద్రవ్వ తన పెంకుటింట్లో రాత్రి నిద్రపోయింది. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు రావడంతో ఆమె బయటకు పరుగెత్తుకొని వచ్చింది. పక్కనే ఉన్న వారి బంధువులను లేపింది. చుట్టుపక్కల వారు పోగై సమీపంలో ఉన్న బోరుతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పినప్పటికి ఇల్లుతో పాటు లోపల ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న బియ్యం, కొత్త బోరు మోటారు, దుస్తులు ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రూ. ఐదు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

రేపల్లెవాడలో గుడిసె..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం రేపల్లెవాడలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కుమ్మరి నాగయ్యకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ప్రమాదంలో రూ.20 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

రైస్‌మిల్లుల తనిఖీ

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో శనివారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కుమ్మన్‌పల్లిలో గల రష్ అగ్రో అండ్ ఎక్స్‌పోర్ట్స్, తగ్గెల్లిలోని ధాన్విక్ ఆగ్రో మిల్స్, అమీర్ ఆగ్రో ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రహీల్ పుడ్ అండ్ క్యాటరింగ్ సర్వీసెస్ రైస్‌మిల్లుల్లో డిస్ట్రిక్ సివిల్ సప్లై ఆఫీసర్ చంద్ర ప్రకాష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. డీటీలు నిఖిల్ రాజ్, అస్పాక్ అహ్మద్, మధు, శ్రీనివాస్, వినోద్ కుమార్, వినోద్ ఉన్నారు.

ప్రాణం ఖరీదు రూ.1.20 లక్షలు!

పిట్లం: కాంపౌండర్ చికిత్స చేయడంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి సదరు వ్యక్తి రూ.1.20 లక్షలు పరిహారం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. మండలంలోని పోతురెడ్డిపల్లి రూం తండాకు చెందిన బిమినిబాయి(62) కడుపు నొప్పితో శుక్రవారం ఆస్పత్రికి రాగా కాంపౌండర్ వైద్యం చేయడంతో చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. పలువురు గ్రామ పెద్దలు, నాయకులు ఆస్పత్రి వద్దకు వచ్చి బిమినిబాయి కుటుంబ సభ్యులతో, కాంపౌడర్‌తో మాట్లాడి రూ.1.20 లక్షలతో ఒప్పందం కుదిర్చారు. సదరు కాంపౌండర్ రూ.20 వేలు బిమినిబాయి కుటుంబానికి ఇప్పించారు. మరో రూ.లక్ష 15 రోజుల్లో ఇవ్వాలని సూచించారు. ఇదిలా ఉండగా మండలంలో సరైన ధ్రువపత్రాలు, అనుభవం లేకున్నా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాంపౌండర్‌లు చికిత్స చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఊరుమ్మడి పండుగ

ఆస్ట్రేలియా నుంచి వచ్చాం



ప్రతి సంక్రాంతి పండుగకు ఆస్ట్రేలియా నుంచి సొంతూరికి వస్తాం. పండుగ సంప్రదాయాలు పిల్లలకు చూపిస్తే కన్న ఊరిపై ప్రేమ కలుగుతుంది. చిన్నప్పటి స్నేహితులందరం కలిసి ముగ్గుల వేస్తుంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేం. రెండేళ్లుగా కరోనా కారణంగా గ్రామానికి రాలేకపోయాం. ప్రస్తుతం గ్రామానికి వారం రోజుల ముందే వచ్చాం. మరో వారం ఉండి గ్రామస్తులందరితో గడిపి వెళ్తాం.

– అనిత

అందరు రావడం విశేషం



సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకుంటున్నాం. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డా ప్రతి ఒక్కరు రావడం గొప్పవిషయం. ఈ సంబురాలు ఏడాది మొత్తం గుర్తుంచుకుంటాం.

– శ్రీనివాస్, వ్యాపార వేత్త, హైదరాబాద్

సంతోషంగా జరుపుకుంటాం



తొమ్మిది ఏళ్లుగా సంక్రాంతి పండుగను జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంటున్నాం. రెండేళ్లుగా కరోనా కారణంగా రాలేకపోయాం. మళ్లీ ఈ సారి అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నాం.

– సత్యనారాయణ, ఏఎస్పీ, హైదరాబాద్

చరిత్ర పరిశోధకుడు సాయరెడ్డి కన్నుమూత



సాయరెడ్డి (ఫైల్)

బోధన్: మండలంలోని లంగ్డాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ చరిత్ర పరిశోధకులు, చరిత్ర విశ్రాంత అధ్యాపకులు సిద్ద సాయరెడ్డి (64) శనివారం ఉదయం కన్నుమూశారు. సాయరెడ్డి స్వగ్రామంలో పాథమిక విద్య, బోధన్‌లో డిగ్రీ కోర్సు పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రముఖ దినపత్రికల్లో జిల్లాలోని చరిత్రాక అంశాలపై వ్యా సాలు రాశారు. కామారెడ్డి గంజ్ వర్తక సంఘం జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా1983లో ఉద్యోగంలో చేరారు. పలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా సేవలందించారు. నిజామాబాద్ జిల్లా చారిత్రిక వైభవం పేరిట పుస్తకాన్ని రాశారు. తాజాగా 'తరతరాల బోధన్ చరిత్ర' గ్రంథాన్ని ర చించి ఆవిష్కరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందారు. కన్నడ ఆదికవి పంపన పేరిట బోధన్ లో సాహితీ అభిమానులు, కవుల సార థ్యంలో ఆవిర్భవించిన పంపా సాహితీ పీఠం సలహదారులు కొనసాగారు. కవి పంపన చరిత్ర వెలికితీసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పంపా సాహితీ పీఠం ప్రతినిధులు అజయ్‌కుమార్, బలరామ రాజు, శేష తల్పసాయి, సత్యనారాయణ, కాట్రగడ్డ భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ గౌసోద్దీన్, మాజీ ఎంపీపీ గంగశంకర్, పాషా మోహినోద్దీన్ సంతాపం తెలిపారు. ఆదివారం స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పిల్లలూ జర పైలం!

- గాలిపటాల సంబరం.. కారాదు విషాదం
- పెద్దల పర్యవేక్షణ అవసరం



బాన్సువాడరూరల్: సంక్రాంతి నేపథ్యంలో గాలిపటాల సందడి నెలకొంది. ఆకాశంలో ఎగురుతున్న రంగురంగుల గాలిపటాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. అయితే గాలిపటాలు ఎగుర వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే వినోదం కాస్తా విషాదంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా దాబాలపై నుంచి పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ తీగలకు చిక్కుకున్న గాలిపటాలను తీయడానికి యత్నించి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటనలు ప్రతి ఏటా వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీంతో పిల్లలు గాలిపటాలు ఎగరేసే సమయంలో పెద్దలు పర్యవేక్షించాలని పలువురు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిట్టగోడలు లేని డాబాలపై నుంచి, పాత గోడలపై ఎక్కి గాలిపటాలు ఎగురవేయొద్దు.
- గాలిపటం తెగి విద్యుత్ తీగలకు చుట్టుకుంటే వాటిని కర్రలు, ఇనుపచువ్వల సహాయంతో తీయడానికి యత్నించొద్దు.
- తెగిపడిన గాలిపటాలను తీసుకోవడానికి వెనుక, ముందు ఆలోచించకుండా పరిగెత్తవద్దు.
- మెటాలిక్ దారాలు, మాంజా వాడొద్దు.
- మైదాన ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయాలి.

తల్లిదండ్రులు పర్యవేక్షించాలి



చిన్నారులు గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు తప్పకుండా పర్యవేక్షించాలి. నిషేధిత చైనా మాంజ, మెటాలిక్ దారాలు వాడరాదు. చైనా మాంజ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. విద్యుత్ ప్రమాదాలు జరిగితే 1912 నంబర్‌కు సమాచారం అందించాలి.

– మహేందర్‌రెడ్డి, సీఐ, బాన్సువాడ

ఇసుక వాహనం పట్టివేత

బిచ్కుంద: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న బొలేరో గూడ్స్ వాహనాన్ని శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు. మద్నూర్ మండలం కుర్లా మంజీర నుంచి అనుమతి లేకుండా ప్రతి రోజు బొలేరో వాహనాల్లో ఇసుక తలిస్తున్నారు. పక్కా సమాచారంతో రెవెన్యూ అధికారులు ఖద్‌గాం వద్ద ఇసుక తీసుకెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ సుల్తాన్ ఖాన్‌ను అదుపులో తీసుకొని డ్రైవర్, ఓనర్ యునుస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.





క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



సత్యరాజు(ఫైల్)

లింగంపేట: మండలంలోని సజ్జన్‌పల్లి శివారులో శుక్రవారం రాత్రి బైకు చెట్టుకు ఢీకొని అల్లం సత్యరాజు(25) మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన అల్లం సత్యరాజు తన భార్య ప్రేమమణి ఇద్దరు పిల్లలతో కలిసి అత్తవారి ఇల్లు సజ్జన్‌పల్లి గ్రామానికి శుక్రవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వచ్చారు. కూతురుకు జ్వరం రావడంతో ఎల్లారెడ్డిలోని తన ఇంట్లో ఉన్న మందులు తీసుకరావడానికి సత్యరాజు రాత్రి వెళ్లాడు. తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ఇంటివద్దనే ఉంచాడు. మందులు తీసుకొని ఇంటి పక్కనే ఉన్న చిన్నమామ బైకు తీసుకొని సజ్జన్‌పల్లికి వచ్చాడు. మందులు భార్య పిల్లలకు ఇచ్చి భోజనం చేసి తిరిగి ఎల్లారెడ్డికి బైక్‌పై రాత్రి బయలుదేరాడు. గ్రామ శివారులో బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొని రోడ్డు పక్కనే ఉన్న బురద నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్ రోడ్డు అతిథి దాబా సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ ఇర్ఫాన్(20) మృతి చెందాడు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని రెంజల్ బేస్ కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ ఆటోనగర్‌లో వెల్డింగ్ పని చేస్తాడు. శుక్రవారం రాత్రి 10:45 గంటల సమయంలో పని ముగించుకొని ఇంటికి బైపాస్ రోడ్డు నుంచి బైక్‌పై వెళ్తుండగా బొలేరో వాహనం ఢీకొంది. ఇర్ఫాన్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి షేక్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు..



అఖిలేష్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నల్ల అఖిలేష్ (21) శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. డిచ్‌పల్లి ఎస్సై గణేష్, మృతుడి కుటుంబికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన అఖిలేష్, ఆర్మూర్‌కు చెందిన రుషికేష్, ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ధీరజ్ ముగ్గురు స్నేహితులు. ప్రస్తుతం వేర్వేరుగా ముగ్గురు ఇంజినీరింగ్ చదువుతున్నారు. సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వచ్చిన ముగ్గురు శుక్రవారం ఒక్క చోట కలిశారు. రుషికేష్‌ను ఆర్మూర్‌లో విడిచి పెట్టేందుకు అఖిలేష్, ధీరజ్ బైక్‌పై బయలుదేరగా సుద్దపల్లి శివారులో వెనక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుషికేష్ శుక్రవారం మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన అఖిలేష్ శనివారం హైదరాబాద్ తరలిస్తుండగా చనిపోయాడు.

పలువురిపై కేసు నమోదు

లింగంపేట: మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శెట్పల్లి గ్రామ శివారులో అయ్యపల్లి గ్రామానికి చెందిన పోచబోయిన బాలయ్యకు ఎకరంనర వ్యవసాయ భూమి ఉంది. గత 20 సంవత్సరాలుగా పంటలు సాగు చేసుకుంటున్నాడు. గతంలో అదే గ్రామానికి చెందిన వారితో భూమి విషయంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో అయ్యపల్లి గ్రామానికి చెందిన పోచబోయిన శ్రీను, గంగారాం, శంకర్, అప్ప లింగం, గోనె లింగం, సున్నం రాజు, పూసల సాయిలు, పిట్ల మల్లయ్య, పోచ బోయిన రుకుంబాయి, రాములు, దాకమొల్ల మల్లయ్య, చిలుక సాయిబాబా పాత కక్షలు మనసులో పెట్టుకొని బాలయ్య పొలంలో గడ్డిమందు చల్లి పంటను నష్టపరిచారు. పంట చేనులోకి అక్రమంగా ప్రవేశించి నష్టపరిచినందున వారిపై లింగంపేట పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

సిరికొండ: మండల కేంద్రంలో పోచమ్మ చౌరస్తాలో శనివారం భారీ కంటెయినర్ లారీ తగలడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తీగలు కూడా లారీ పైన కాకుండా కింద పడటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటుక బట్టీలకు చెందిన లారీలు ఊక కొరకు మండలంలోని రైస్‌మిల్లులకు వస్తున్నాయి. కంటెయినర్‌లు భారీ ఎత్తుతో ఉండటంతో నిత్యం ఏదో ఒక చోట విద్యుత్ తీగలకు తగులుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

మాక్లూర్: మండలంలోని కల్లేడి గ్రామానికి చెందిన ప్రసాద్‌గౌడ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 6న ప్రసాద్‌గౌడ్‌ను అదే గ్రామానికి చెందిన వినోద్ తమ నాయకుడు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడుతూ వీడియో వైరల్ ఎందుకు చేశావని ప్రశ్నించాడు. దీంతో ప్రసాద్‌గౌడ్, వినోద్‌పై దాడి చేశాడు. ఆయన అదే రోజు మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారించిన మీదట ప్రసాద్‌గౌడ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రసాద్‌గౌడ్ గతంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి తుపాకితో హత్య చేసేందుకు యత్నించాడన్న ఆరోపణలున్నాయి.